క్లుప్తంగా

డిండి క్రికెట్ క్లబ్‌కు రూ.15వేలు అందజేత


డీసీసీ సభ్యులకు చెక్కు అందజేస్తున్న చంద్రన్న ఫౌండేషన్ సభ్యులు

డిండి : మండల కేంద్రానికి చెందిన డిండి క్రికెట్ క్లబ్(డీసీసీ)కు శనివారం చంద్రన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.15వేల విరాళం అందజేశారు. ఈ నగదును క్రికెట్ కిట్ కొనుగోలు చేయడానికి అందజేసినట్లు ఆ ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రన్న ఫౌండేషన్ నిర్వాహకులు శ్రీనివాస్‌గౌడ్‌కు డీసీసీ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయికుమార్, జయవర్ధన్, ఖలీం, కిట్టు, సంతోష్ పాల్గొన్నారు.

అనుమతుల్లేని పాఠశాలల్లో చేర్పించొద్దు

కొండమల్లేపల్లి : ప్రభుత్వ అనుమతి లేని ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించొద్దని ఎంఈఓ మాత్రునాయక్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ అనుమతులను నిర్ధారించుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. అనుమతి లేకుండా అడ్మిషన్లు తీసుకుంటే ప్రైవేటు పాఠశాలలపై చట్టరీత్య చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంజీయూ రిజిస్ట్రార్ రవి, తదితరులు

దేవరకొండ : స్థానిక ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల 2024–25విద్యా సంవత్సరానికి సంబంధించి అకాడమిక్ పోస్టర్‌ను శనివారం కళాశాల ఆవరణలో ఎంజీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ అల్వాల రవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు తెలిపారు. ఎంకేఆర్ కళాశాలలో విద్యార్థులకు అందిస్తున్న కోర్సులను కళాశాల ప్రిన్సిపాల్ రమావత్ రవి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంజీ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి ఉపేందర్‌రెడ్డి, అధ్యాపకులు పృథు, బాల, లింగమయ్య, కోటయ్య, ప్రభాకర్, మకట్ లాల్, తదితరులు పాల్గొన్నారు.

జనమైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

మిర్యాలగూడ అర్బన్ : వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జనమైత్రి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎండీ. మునీర్ అన్నారు. ప్రతి నెల ఒకటో తేదీన ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే వైద్యశిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజు, తులసీరాం, మీసా రోహిత్ లు రోగులనురిక్షించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు నరేందర్, కృష్ణారెడ్డి, మల్లయ్య, ఇద్దయ్య, సైదులు, పాదిల శ్రీనివాస్, నరేంద్రబాబు, నాగయ్య, సతీశ్‌రెడ్డి, ఉష, చరణ్, రవి శ్రవణ్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

డిండి : ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్న ఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం మిట్టసదగోడు గ్రామానికి చెందిన ఆడెపు శేఖర్ ఎలాంటి అనుమతులు లేకుండా డిండి చింతపల్లి వాగు నుంచి ట్రాక్టర్‌లో ఇసుకను అక్రమంగా డిండి పట్టణానికి తరలిస్తున్నాడు. ఈ క్రమంలో సమాచారం తెలుసుకున్న పోలీసులు దాడి చేసి ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. ఈ మేరకు అతడి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ.రాజు తెలిపారు.

గ్రామీణ వైద్యులపై దాడులు అరికట్టాలి

మాడుగులపల్లి : గ్రామీణ వైద్యులపై దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం కృషి చేయాలని రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్ అసోసియేషన్ మీడియా సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ రసూల్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. గ్రామీణ వైద్యుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఆర్ఎంపీలు, పీఎంపీలకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు జారీ చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్ఎంపీలపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వం చూస్తూ ఊరుకోవడం దారుణమని మండిపడ్డారు.

ఊరూరా హనుమాన్ జయంతి వేడుకలు


నాగార్జునసాగర్ : హిల్‌కాలనీలో పూజలు చేస్తున్న మహిళలు


హాలియా : ఇబ్రహీంపేట ఆలయంలో పూజలో పాల్గొన్న భక్తులు

మిర్యాలగూడ : హనుమాన్ జయంతి వేడుకలను పట్టణంతోపాటు ఆయా గ్రామాల్లో భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని శ్రీనివాస్‌నగర్‌లోగల హనుమాన్ ఆలయంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని భగవంతున్ని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

హాలియా : పట్టణంలోని శ్రీపబ్బతి భక్తాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాలను శనివారం వైభవంగా నిర్వహించారు. శత ఘట కలశాభిషేకం 108 కలశాలతో మూలస్వామికి పంచామతాభిషేకం, అర్చన తదితర పూజలను ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. హాలియా మున్సిపల్ చైర్‌పర్సన్ యడవెల్లి అనుపమానరేందర్ రెడ్డి, ఆలయ చైర్మన్ మోహన్‌రావు, కోశాధికారి రేపాల వెంకన్న. మాజీ మార్కెట్ చైర్మన్ కాకునూరి నారాయణగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌనీ రాజారమేష్ యాదవ్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిట్టిపోలు యాదగిరి పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సీతా రామచంద్ర స్వామి ఆలయంలో..

హాలియా మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రహీంపేట గ్రామంలో శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో 14వ వార్షికోత్సవ మహోత్సవ పూజ. హనుమాన్ జయంతి మహోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్న పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో హాలియా మున్సిపల్ చైర్‌పర్సన్ యడవెల్లి అనుపమనరేందర్‌రెడ్డి, విశ్రాంతి ఎంఈఓ కీసర యుగేందర్‌రెడ్డి, పీఏసీఎస్ కొత్తపల్లి డైరెక్టర్ నల్లబోతు వెంకటయ్య, పేరూర్ గోవింద్, దుబ్బాకుల సైదులు, రమేష్, నల్ల బోతు కొండలు, మల్లేష్ తదితరులు ఉన్నారు.


మిర్యాలగూడ : ఆలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి దంపతులు

త్రిపురారం : మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయాల్లో భక్తులు తెల్లవారుజామునుంచే ప్రత్యేక పూజలు చేశారు. పలు దేవాలయాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గౌరవ సలహాదారు అనుముల శ్రీనివాస్ రెడ్డి, త్రిపురారం మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్ రెడ్డి, నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మర్ల చంద్రా రెడ్డి, మజ్జిగపు వెంకట్ రెడ్డి, పాండు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : హనుమాన్ జయంతి వేడుకలను మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయ పూజారి మురళీధరచార్యులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నాగార్జునసాగర్: నందికొండ హిల్‌కాలనీలోని కెనాల్స్‌లోగల హనుమాన్ ఆలయంలో జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే భక్తులు హనుమాన్‌చాలీసా పఠనం చేశారు. అమృతాభిషేకం నిర్వహించారు. పలు పండ్లరసాలతో విగ్రహానికి అభిషేకం చేశారు. అనంతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


హాలియా : పూజ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ దంపతులు


త్రిపురారం : ఆంజనేయ స్వామికి పూజలు చేస్తున్న అనుముల శ్రీనివాస్‌రెడ్డి

నిడమనూరు: మండల కేంద్రంతో పాటు మండలంలోని శాకాపురంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహకులు నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యే పూజలు చేశారు. ఈసందర్భంగా పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మాడుగులపల్లి : మండల వ్యాప్తంగా శనివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మర్రిగూడెంలోని ఆంజనేస్వామి ఆలయంలో ఉదయం నుంచే భక్తుల కోలాహలం కనిపించింది. మాచినపల్లి, గుర్రప్పగూడెం, చిరుమర్తి, ఆగామోత్కూర్ తదితర గ్రామాల్లోని ఆలయాల్లో అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి.

లైసెన్స్ డీలర్ల వద్దే విత్తనాలు కొనాలి

పెద్దవూర: లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే రైతులు విత్తనాలను కొనుగోలు చేయాలని పెద్దవూర క్లస్టర్ ఏఈఓ ఆంజనేయులు అన్నారు. శనివారం మండలంలోని వెల్మగూడెం గ్రామంలో వానాకాలం సీజన్‌లో రైతులకు అవగాహన కల్పించి మాట్లాడారు. లూజు విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ కొనుగోలు చేయకూడదని, నకిలీ విత్తనాలపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రశీదుపై విక్రయదారుడి పేరు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అమ్మకాల పన్ను నంబర్, గ్రామం పేరు, సంతకం, తేదీలు, విత్తన రకం పేర్లు, బ్యాచ్ నంబర్, గడువు తేదీలు, నికర తూకం, నికర ధర, కంపెనీ పేరు తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. కొనుగోలు చేసిన సరుకును డీలర్ వద్ద తూకం వేయించాలని తెలిపారు.

హాలియా : డీలర్లు, ఇతరులు ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హాలియా ఎస్ఐ సతీష్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ఏడీఏ సందీప్ కుమార్ తెలిపారు. శనివారం కొత్తపల్లి రైతు వేదికలో నిర్వహించిన సీడ్ డీలర్స్ డివిజన్‌స్థాయి సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. డీలర్లు పత్తి విత్తనాలను ఎమ్మార్పీ ధరకే రైతులకు విక్రయించాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు రైతులు రశీదు తీసుకొని, పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపర్చుకోవాలని తెలిపారు. అలాగే లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దే కొనుగోలు చేయాలి తప్ప గ్రామాలకు వచ్చే వారి విడి విత్తనాలు తీసుకోవద్దని సూచించారు. నకిలీ విత్తనాలు విక్రయించినా, రైతులకు బిల్లులు ఇవ్వకుండా విక్రయాలు జరిపినా కఠిన చర్యలు తీసుకుంటామని డీలర్లను హెచ్చరించారు. అనంతరం పట్టణంలోని ఎరువుల షాపును వారు తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్, విత్తన ప్యాకెట్లపై ఉన్న లాట్ నంబర్, షాపు డోర్ నంబర్, బిల్ బుక్ తదితర వాటిని పరిశీలించారు. విత్తన షాపులలో అందుబాటులో ఏఏ విత్తనాలు, ఎన్ని అందుబాటులో ఉన్నాయో స్టాక్ బోర్డుపై రాయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు సరిత, జానకిరాములు, పార్వతీ చౌహన్, మాధవరెడ్డి, ఏఈఓ విజయచందర్. డీలర్లు తదితరులు ఉన్నారు.


హాలియా : ఎరువుల షాపులో తనిఖీ చేస్తున్న ఎస్ఐ సతీష్‌రెడ్డి

బడిబాట సన్నాహక సమావేశం


సన్నాహక సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం బడిబాట సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ చైర్మన్ వస్కుల సుమలత మాట్లాడుతూ అకాడమిక్ విద్యా సంవత్సరానికి సంబంధించి బడిబాట కార్యక్రమాన్ని బాధ్యయుతంగా చేపట్టి అధిక అడ్మిషన్లు వచ్చేలా కృషిచేయాలన్నారు. ఈ సమావేశంలో హెచ్ఎం చేరుపల్లి శ్రీనివాస్, ఉపాధ్యాయులు కొర్ర లోక్యా నాయక్, గిరి, లక్ష్మయ్య, నల్ల నర్సింహా, సైదా నాయక్, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందజేత

నిడమనూరు : మండలంలోని మార్లగడ్డ తండాకు చెందిన సపావత్ దీప్లా నాయక్‌కు యడవెల్లి రంగశాయిరెడ్డి ట్రైసైకిల్‌ను శనివారం అందజేశారు. యడవెల్లి వల్లభరెడ్డి సొంత ఖర్చులతో లహరి ఫౌండేషన్ తరుపున బ్యాటరీతో నడిచే ట్రైసైకిల్‌ను అందజేశారు. దీప్లానాయక్ ఇబ్బందిని గమనించి సాయం చేయాలనే ఉద్దేశంతో ట్రైసైకిల్‌ను కొనిచ్చినట్లు తెలిపారు. బ్యాటరీతో నడిచే ట్రైసైకిల్ ఇవ్వడంపై దివ్యాంగుడు దీప్లా సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు అంకతి సత్యం, నందికొండ మట్టారెడ్డి, ముంగి శివమారయ్య, తదితరులున్నారు.


ట్రైసైకిల్ అందజేస్తున్న రంగశాయిరెడ్డి, వల్లభరెడ్డి

పాఠ్యపుస్తకాల డంప్ సీజ్

మిర్యాలగూడ అర్బన్ : ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన పాఠ్య పుస్తకాలను డంప్ చేసిన ఇంటిని విద్యాశాఖ అధికారులు శనివారం సీజ్ చేసిన ఘటన మిర్యాలగూడ పట్టణంలోని కృష్ణ కాలనీలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే ఆ కాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని పాఠ్యపుస్తకాలను డంప్ చేశారు. ఈవిషయాన్ని సామాజిక వేత్త రుషికేశ్వర్‌రాజు, చిలుముల కొండలు, కార్తిక్‌రాజులు జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతికి ఫోన్‌లో సమాచారం అందించారు. దీంతో ఆయన ఎంఈఓ బాలాజీనాయక్‌కు సమాచారం అందించి పాఠ్యపుస్తకాల డంప్‌పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వెంటనే ఎంఈఓ కార్యాలయ సిబ్బందితో కలిసి వెళ్లి పుస్తకాలు డంప్ చేసిన ఇంటిని సీజ్ చేశారు. ఈ విషయంపై పూర్తి విచారణ చేపట్టి జిల్లాద్యాశాఖ అధికారులకు నివేదిక పంపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పాఠశాలను సీజ్ చేయాలి

ఇంటిలో పాఠ్య పుస్తకాలను డంప్ చేసిన శ్రీ చైతన్య స్కూల్‌ను వెంటనే సీజ్ చేయాలని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సామాజిక వేత్త రుషికేశ్వర్ రాజు డిమాండ్ చేశారు. ప్రభుత్వ జీఓలను ఉల్లంఘించి అక్రమంగా పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్నారని ఆరోపించారు.


ఇంటిలో భద్రపరిచిన పాఠ్యపుస్తకాలు

ఇంటిని సీజ్ చేసిన విద్యాశాఖ అధికారులు

మా పాఠశాలకు సంబంధం లేదు

పాఠ్య పుస్తకాలు నిల్వ ఉంచిన ఇంటికి తమ పాఠశాలకు ఎలాంటి సంబంధం లేదని శ్రీ చైతన్య పాఠశాల రీజినల్ ప్రిన్సిపల్ సుజిత అన్నారు. ఆ పుస్తకాలు విద్యాస్థలి ఎడ్యుకేషన్ అండ్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ వారికి చెందినవి అని, తమ పాఠశాల ప్రతిష్టను దెబ్బతీసే విధంగా ఆరోపణలు చేయడం సరికాదని పేర్కొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం


కరాటే బెల్ట్ టెస్ట్ ప్రారంభిస్తున్న సభ్యులు

దేవరకొండ : ఆత్మరక్షణకు కరాటే ఎంతగానో దోహదపడుతుందని తెలంగాణ ఏపీ కరాటే చీఫ్ ఎగ్జామినర్ రాపోలు సుదర్శన్ అన్నారు. శనివారం దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దేవరకొండ డివిజన్ స్థాయి కరాటే బెల్ట్ టెస్ట్‌ను ఆ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌విటీ, తిమ్మాపురం సింగిల్ విండో చైర్మన్ శ్రీశైలం యాదవ్‌తో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేవరకొండ ప్రాంత క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. బెల్ట్ టెస్ట్‌లో దాదాపు 104 మంది పాల్గొన్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంతులాల్‌నాయక్, మాస్టర్ శ్రీను, భాస్కర్, జగన్, రాంబాబు, సురేష్, పాల్గొన్నారు.

సామాజిక తనిఖీకి సహకరించాలి

మిర్యాలగూడ : మున్సిపాలిటీలో సామాజిక తనిఖీకి సహకరించాలని కోరుతూ ఆర్టీఐపీ సలహా, సూచనల సమితి కార్యకర్తలు మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, కమిషనర్ ఎండీ యూసుఫ్‌లకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సమితి కార్యకర్త సరికొండ రుషికేశ్వర్‌రాజు మాట్లాడుతూ మిర్యాలగూడ మున్సిపాలిటీకి వచ్చే ఆదాయం, ఖర్చులు, ఎంబీలు, గ్రీన్ బడ్జెట్ వివరాలు తెలపాలన్నారు. కేంద్రం ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు, గ్రాంట్‌లు, మున్సిపాలిటీ నిర్వహించే రికార్డులు, తీర్మానాలు, అమలయ్యే పథకాలు వంటి అంశాలపై పట్టణ పేదరిక నిర్మూలన, ప్రజారోగ్య, పరిపాలన, ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక, రెవెన్యూ, గణాంక విభాగాల్లో సామాజిక తనిఖీకి అవకాశం కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు చిలుముల కొండలు, దేవులపల్లి కార్తీక్‌రాజు, ఉప్పతల్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.


మున్సిపల్ చైర్మన్ భార్గవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్యకర్తలు

ఉపాధి హామీ కూలీలకు అవగాహన


కూలీలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రాజు

మిర్యాలగూడ : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలకు పనిప్రదేశంలో వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. శుక్రవారం డాక్టర్ జాడి రాజు శెట్టిపాలెంలోని ఉపాధి హామీ కూలీలను కలిసి మాట్లాడారు. వేసవిలో ఎలాంటి నీరు తాగాలి, శీతలపానియాలకు దూరంగా ఉండాలని, వంట పాత్రలు, వంట నూనెలు, పాలిథిన్ కవర్ల వినియోగం వల్ల కలిగే నష్టాలు, ఆరోగ్య సమస్యలు, జనరిక్ మందులపై అవగాహన కల్పించారు. అదే విధంగా మహిళలు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలను వివరించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. రమణరెడ్డి, సత్యనారాయణరావు, కృష్ణారావు, కోల శ్రీనివాస్, ఎఫ్ఏ శంకర్‌లు ఉన్నారు.

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

మిర్యాలగూడ : ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ బైరం దయానంద్ కోరారు. శనివారం దామరచర్ల మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఆస్పత్రిలో సీహెచ్‌ఓకు ఆశ వర్కర్లతో కలిసి వినతిపత్రం అందజేసి ఆయన మాట్లాడారు. ఆశలకు నష్టం కలిగించే విధంగా నిర్వహించే పరీక్షను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం, ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చిన హామీలను, సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆవ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మహేశ్వరి, మండల కార్యదర్శి జయమ్మ, పద్మ, సావిత్రమ్మ, కలమ్మ, గౌస్యబేగం, శ్రీదేవి, నీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆశలకు పరీక్ష పెట్టే ఆలోచనను విరమించుకోవాలి

పెద్దవూర : ఆశలకు పరీక్ష నిర్వహించే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని శనివారం పీహెచ్‌సీలో వైద్యాధికారి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించి మాట్లాడారు. ఆశలకు గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు, ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, కనీస వేతనం రూ.26వేలు అందించాలన్నారు. జాబ్ చార్ట్ రూపొందించాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని, అర్హత కలిగిన ఆశలకు ఏఎన్ఎంలుగా ప్రమోషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్‌కే బషీర్, మండల కార్యదర్శి ఊరె ప్రభాకర్, ఆశవర్కర్లు వెంకటమ్మ, సత్తమ్మ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ అర్బన్ : పెండింగ్‌లో ఉన్న ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లు గౌతంరెడ్డి అన్నారు. శనివారం ఆశ కార్యకర్తల సమస్యలపై బంగారుగడ్డ పీహెచ్‌సీ డాక్టర్‌కు వినతిపత్రం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఆశ వర్కర్ల కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని, ప్రతినెల రెండో తేదీన పారితోషికం ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరుపతి రామ్మూర్తి, బంటు రామారావు, ఆశ వర్కర్లు పద్మ, కవిత, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


మిర్యాలగూడ : సీహెచ్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న ఆశ వర్కర్లు


పెద్దవూర : వైద్యాధికారికి వినతిపత్రం అందజేస్తున్న లక్ష్మీనారాయణ

ఎన్నికల భత్యం ఇవ్వాలని బీఎల్‌ఓల వినతి


ఆర్డీఓ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న బీఎల్‌ఓలు

మిర్యాలగూడ అర్బన్ : ఎన్నికల విధుల్లో పాల్గొన్న భత్యం వెంటనే ఇవ్వాలని కోరుతూ బీఎల్‌ఓలు శనివారం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో భాగంగా ఓటర్ స్లిప్‌ల నుంచి పోలింగ్ పూర్తయ్యే వరకు పనులు చేయించుకున్నారన్నారు. అందుకు ప్రతి ఫలంగా తమకు డబ్బులు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమతో చేయించుకుని డబ్బులు అడిగితే బడ్జెట్ రాలేదని చెప్పడం ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికైన అధికారులు స్పందించి తమకు ఎన్నికల విధుల డబ్బులు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బీఎల్‌ఓలు సుజాత, పార్వతి, స్వరాజ్యం, విజయ, తిరుమలేశ్వరి, పద్మ, సుల్తానా, రామానుజమ్మ, నాగమణి, రేషిదా, రమాదేవి పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకుందాం

మిర్యాలగూడ అర్బన్: కేంద్ర ప్రభుత్వం నీరుగారుస్తున్న ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకునేందుకు కార్మికులంతా ఐక్యఉద్యమాలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య అన్నారు. శనివారం మిర్యాలగూడలోని సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన ఉపాధి హామీ చట్టరక్షణ సదస్సులో పాల్గొని మాట్లాడారు. ఉపాధి హామీ పథకం అమలుకు రూ.2 లక్షల కోట్లు అవసర ఉండగా బడ్జెట్‌లో కేవలం రూ.63 వేల కోట్లు మాత్రమే కేటాయించడం బాధాకరమన్నారు. పేదలకు ఉపాధి హామీ చట్టాన్ని దూరం చేయాలని ఉద్దేశంతో మోదీ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఈ నెల 10న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే రాష్ట్ర సదస్సుకు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిల్లుట్ల సైదులు, కందుకూరి కోటేష్, బొడ్డు బాలసైదులు, అంజయ్యాచారి, శేఖర్, సీతారాములు, మారయ్య, అలివేలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నారి ఐలయ్య

అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు పరిశీలన


పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శేషగిరిశర్మ

మిర్యాలగూడ : మండలంలోని కురియాతండా లోని మండల ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను ఎంపీడీఓ శేషగిరి శర్మ, సహాయ ఇంజనీర్ ఆదినారాయణలు శనివారం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ పాఠశాలలు పునః ప్రారంభయ్యేలోపు పనులు పూర్తి చేయాలని కోరారు. తరగతి గదుల్లో ఫ్యాన్స్, ట్యూబ్‌లైట్స్, తాగునీటి వసతి, టాయ్‌లెట్స్ నిర్మాణం, మైనర్ రిపేర్లు వంటి పనులను పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ ఆదేశానుసారం అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా మంజూరు చేసిన పనులను కమిటీ ద్వారా పూర్తి చేయాలన్నారు.

మహాత్మా జ్యోతిబా పూలే అవార్డుకు ఎంపిక


అవార్డు ఎంపిక లెటర్ అందుకుంటున్న భాస్కరాచారి

దేవరకొండ : బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో అందించనున్న మహాత్మా జ్యోతిబా పూలే జాతీయ అవార్డుకు దేవరకొండ పట్టణానికి చెందిన బీసీ సంక్షేమ సంఘం నాయకులు చొల్లేటి భాస్కరాచారి ఎంపికయ్యాడు. శనివారం హైదరాబాద్‌లో బహుజన సాహిత్య అకాడమీ జాతీయ చైర్మన్ నల్ల రాధాకృష్ణ భాస్కరాచారికి ఎంపిక లెటర్‌ను అందజేశారు. తన సేవలను గుర్తించి అవార్డుకు ఎంపిక చేయడంపై ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈనెల 10న పూణేలో అవార్డు అందుకోనున్నట్లు పేర్కొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి


టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఐ వీర శేఖర్

త్రిపురారం : గ్రామీణ ప్రాంతాల్లో యువత క్రీడల్లో రాణించాలని ఎస్ఐ వీరశేఖర్ అన్నారు. శనివారం త్రిపురారం మండలంలోని బాబుసాయి పేటలో యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం గ్రామ పెద్దలు, యూత్ సభ్యులు ఎస్ఐ వీర శేఖర్‌ను శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, క్రికెట్ ఆర్గనైజర్స్ పాల్గొన్నారు.